క్లుప్తంగా

బాలగురునాథీశ్వరుడికి పూజలు


ప్రత్యేక దీపారాధన చేస్తున్న వేదపండితులు

పాలసముద్రం : మండలంలోని రాచపాల్యం గ్రామంలో వెలసిన బాలగురునాథీశ్వరస్వామికి గ్రామస్తులు మంగళవారం కార్తీక మాస పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి వివిధ అభిషేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం స్వామివారి పూజాసామగ్రిని మంగళ వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపుగా ఆలయానికి తెచ్చి సమర్పించారు. వేద పండితులు స్వామివారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక దీపారాధన, పూజలు చేశారు. పుత్రసంతానం, పెళ్లి కాని వారు ఆలయంలో పిండి దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు.

కాలభైరవుడికి విభూది అలంకరణ



నగరి : పట్టణ పరిధిలోని శ్రీకామాక్షీ సమేత కరకంతేశ్వర ఆలయంలోని శ్రీ కాలభైరవ స్వామికి మంగళవారం అష్టమి పూజల్లో భాగంగా విభూది అలంకరణ సేవ చేపట్టారు. అలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. అష్టమి పూజలను పురస్కరించుకుని కాలభైరవ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి పాలు, పెరుగు పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. అభిషేకానంతరం పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులను అమితంగా ఆకట్టుకుంది. భక్తులు స్వామిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం : గ్రామ సచివాలయాల్లో పని చేసే ఉద్యోగులు సమయపాలన పాటించి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ విద్యావతి తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులతో ఆమె మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు నిష్పక్షపాతంగా పనిచేయాలని సూచించారు. సిబ్బంది సమయపాలన తప్పక పాటించాలని తెలిపారు. అనంతరం మూమెంట్ రిజిస్టర్, కార్యాలయ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా అంబల పూజ



శ్రీరంగరాజపురం : మండలంలోని కటికపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ మార్కొండయ్య ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి అంబలపూజను అయ్యప్పస్వామి మాలధారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఏటా అయ్యప్పస్వామికి పూజలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు వెంకటరమణ, చంద్రయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఒరవ కాలువల్లో చెత్త తొలగింపు



పుత్తూరు: మున్సిపాలిటీ 21వ వార్డులోని చినరాజుకుప్పం గ్రామ పరిధిలోని ఒరవ కాలువల్లో పేరుకుపోయిన చెత్తచెదారాలను మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఎ.హరి జేసీబీ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ మిచాంగ్ తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు నీటి ప్రవాహనం రోడ్లపైకి, రైతు పొలాల్లోకి వెళ్తున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి ఆర్కే రోజా ఆదేశాల మేరకు ఒరవ కాలువల్లో పేరుకుపోయిన చెత్తచెదారాలను తొలగించడంతో పాటు, ఆక్రమణలను సైతం తొలగించడం జరిగిందని తెలిపారు. సర్వే నిర్వహించి పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, కార్తికేయన్, నాయకులు జనార్దన్‌యాదవ్, నాగూర్, చంద్ర పాల్గొన్నారు.

జలమయమైన కాకవేడు ఏపడబ్ల్యూ, కొప్పేడు కాజ్‌వే వద్ద నీటి ప్రవాహం, ఇందిరమ్మ లేఅవుట్‌లో జలమయమైన నివాసాలు, కీళపట్టులో నీటమునిగిన వరిపంట






కుశస్థలి ఉగ్రరూపం

- మిచాంగ్ తుపాన్ ప్రతాపం
- వంతెనను తాకుతూ పారిన ఉయ్యాలకాలువ
- జలమయమైన పలు ప్రాంతాలు
- శరవేగంగా సహాయక చర్యలు


వడమాలపేట కాజ్‌వే వద్ద నీటి ప్రవాహం, (ఇన్‌సెట్) నగరి: వంతెనను తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తున్న ఉయ్యాల కాలువ

నగరి : మిచాంగ్ ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు ఎడతెరపి లేకుండా ఈదురు గాలులతో కూడిన జోరువర్షం కురిసింది. నగరి మండలంలో 309.2 మిల్లీమీటర్ల వర్షం నమోదు కాగా, విజయపురంలో 278.8, నింద్రలో 226 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం అధికంగా కురవడంతో తాకిడికి పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కృష్ణాపురం డ్యాం గేట్లు తెరిచిన కారణంగా కుశస్థలి నదిలో నీరు పొంగి పార్లింది ముందస్తు జాగ్రత్తగా కీళపట్టు లోతట్టు వంతెనకు ఇరువైపులా పోలీసులు బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఉయ్యాల కాలువ పొంగి పార్లడంతో టీఆర్ కండ్రిగ ఇందిరమ్మ కాలనీ, కాకవేడు ఏడబ్ల్యూ, సాయినగర్, అశోక్ నగర్ ప్రాంతాలు జలమయమయ్యాయి. తడుకుపేట శెట్టిగుంట ఎస్టీ కాలనీలో నివాసాల్లోకి నీరు చేరింది. వారికి వైస్ ఎంపీపీ కన్నియప్ప, స్థానిక నాయకుడు రాజేంద్ర ఆహారం పొట్లాలను అందించి భరోసా కల్పించారు. కీళపట్టు చెరువు పొంగి పార్లడంతో నలుగురు రైతులకు చెందిన 14 ఎకరాల వరిపంట నీట మునిగింది.

కబ్జాకు గురైన ఒరవ కాలువలు

పుత్తూరు: మండలంలోని చెర్లోపల్లి రెవెన్యూ పరిధిలోని ఒరవ కాలువలు ఆక్రమణలకు గురికావడంతో వర్షపు నీరు చిత్తూరు–పుత్తూరు రహదారిపై ప్రవహిస్తోంది. అలాగే మామిడి తోటల్లోకి నీరు చేరి చెరువులను తలపిస్తోంది. ఒరవ కాలువల ఆక్రమణలపై చినరాజుకుప్పం, చెర్లోపలి, నెత్తం, కల్యాణపురం గ్రామాల రైతులు అధికారులకు సమాచారం అందించినా స్పందించలేదని ఆరోపిస్తున్నారు. గత మూడు రోజులుగా తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు తమ తోటల్లోకి, పొలాల్లోకి నీరు చేరుతోందని, ఇందుకు ఒరవ కాలువల ఆక్రమణలే కారణమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఒరవ కాలువల ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు.

కొట్టుకుపోయిన మోటార్ సైకిల్..

పుత్తూరు మండలం తడుకు పంచాయతీ మిట్టపాళెం గ్రామం వద్ద గల బ్రిడ్జి వద్ద వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో మోటార్ సైకిల్ కొట్టుకుపోయింది. ఈ ఘటనలో మోటర్ సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి నీటి ఉధృతికి కింద పడి అతి కష్టం మీద ఒడ్డుకు రాగలిగాడు. అయితే కొట్టుకుపోయిన మోటర్ సైకిల్‌ను తడుకు పంచాయతీ సర్పంచ్ వెంకటేష్ జేసీబీ సాయంతో వెలికి తీయించారు.

రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు

పుత్తూరు మండల పరిధిలోని రాచపాళెం, శిరుగురాజుపాళెం గ్రామాల వద్ద రైల్వే శాఖ వారు నిర్మించిన అండర్ బ్రిడ్జిల వద్ద వర్షపు నీరు చేరింది. దీంతో గ్రామాల మధ్య రాకపోకలు స్థంభించాయి. నీటిని తోడేందుకు ఏర్పాటు చేసిన మోటార్లు పనిచేయకపోవడం, కొన్ని చోట్ల మోటార్లే లేకపోవడం వంటి కారణాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రాచపాళెంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ ఎస్.కృష్ణమరాజు మోటార్ సాయంతో నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేశారు.

నిండిన గూళూరు చెరువు

పుత్తూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అతిపెద్ద చెరువుల్లో ఒకటైన గూళూరు చెరువు కలుజు పారుతోంది. వడమాలపేట మండలంలోని ఈ చెరువు విస్తీర్ణం 488 ఎకరాలు. చెరువులో సమృద్ధిగా నీరు ఉన్నప్పటికీ ఇటీవల కాలంలో కలుజు పారలేదు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగళవారం ఉదయం నుంచి కలుజు పారుతోంది. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కలుజు వద్ద పలువురు చేపలు పడుతూ సందడి చేశారు. అలాగే వడమాలపేటలోని కాజువే వద్ద వర్షపునీరు ఉధృతంగా నీరు ప్రవహించింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బైపాస్ ద్వారానే వాహనాలు తిరిగాయి.

నింద్రలో..

నింద్ర: మండలంలో కురిసిన వర్షాలకు మంగళవారం అత్తూరు ఎస్టీకాలనీ, ఎలకాటూరు దళితవాడల్లోకి వర్షపు నీరు రావడంతో ప్రజలు భయాందోళన చెందారు. చెరువుల్లోకి నీటి ప్రవాహం పెరిగి నిండిపోవడంతో గ్రామాల్లోకి నీరు చేరింది. ఎలకాటూరు నుంచి పాలమంగళం వెళ్లేదారిలో ఉన్న కాజ్‌వే వద్ద నీటి ప్రవాహం పెరగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా శ్రీరామాపురం, కొప్పేడు కాజ్‌వే వద్ద అరుణానది ప్రవాహం పెరిగి రోడ్డుపైకి నీరు రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎలకాటూరు గ్రామం దళితవాడలో నీరు చేరడంతో నగరి ఆర్‌డీఓ సుజన ఆయా ప్రాంతాలను పరిశీలించారు. అలాగే అత్తూరు, అగరం, నింద్ర గ్రామాల్లో రైతుల వేరుశనగ, వరి, ఉద్దులు పంట పొలాల్లో నీరు చేరడంతో అపార నష్టం జరిగిందని రైతులు తెలిపారు. ఆరూరు చెరువు వద్ద కొద్దిపాటి నీరు లీకేజీ కావడంతో గమనించిన స్థానికులు మరమ్మతులు చేశారు.

సహాయక చర్యలు

మండలంలోని అత్తూరు ఎస్టీకాలనీలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో నివాసితులకు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తాగునీరు అందించారు. నింద్ర దళితవాడలో ఇళ్లు పడిపోయిన బాధితులను సర్పంచ్ బాబురెడ్డి, వీఆర్‌ఓ రుక్మిణి పరిశీలించి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అలాగే మండలంలో తుపాను ధాటికి 20 విద్యుత్ స్తంభాలు, 10 ట్రాన్స్‌ఫార్మర్లు నేలవాలాయి. దీంతో రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.

యంత్రాంగం అప్రమత్తం

విజయపురం (నగరి) : మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం విజయపురం లోతట్టు ప్రాంతాలైన మహారాజపురం, శ్రీహరిపురం ఆదిఆంధ్రవాడ, కోసల నగరం, ముత్తప్పరెడ్డికండ్రిగ, కలియంబాకం, బూచితవానత్త గ్రామాల్లో పర్యటించారు. అనంతరం కాలువలు, చెరువులను పరిశీలించారు.


చినరాజుకుప్పం వద్ద ఒరవ కాలువ నుంచి తోటలోకి ప్రవహిస్తున్న నీరు


ఏకాంబరకుప్పంలో కూలిన ఇంటి గోడ


చెరువులను తలపిస్తున్న మామిడి తోటలు


శ్రీహరిపురం ఆదిఆంధ్రవాడలో పర్యటిస్తున్న అధికారులు


కలుజు పారుతున్న గూళూరు చెరువు


నీట మునిగిన పంటను చూపుతున్న రైతు

తుపాను నష్టం ఇలా

నగరి : మిచాంగ్ తుపాను తాకిడికి ఏర్పడిన నష్టం వివరాలను తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం ప్రకటించారు. మూడు రోజుల పాటు కురిసిన వర్షాలకు మండలంలో 7 గుడిసెలు, మట్టి గోడలతో నిర్మించిన ఇల్లు 4 పూర్తిగా శిథిలం అయ్యాయి. అలాగే మట్టిగోడలతో నిర్మించిన 34 ఇళ్లు, పక్కా గృహాలు 6 పాక్షికంగా దెబ్బతిన్నాయి. 84 గృహాలు ముంపునకు గురయ్యాయి. వేలావడి ఎస్టీ కాలనీలో 70 కుటుంబాలు, కాకవేడు ఏఏడబ్ల్యూలో 9 కుటుంబాలు, నాగరాజకుప్పంలో 4 కుటుంబాలు, కావేటిపురంలో 3 కుటుంబాలు, మేళపట్టులో ఒక కుటుంబం ముంపు బారి పడ్డాయి. 16 హెక్టార్లలో వరిపంట, 19 హెక్టార్లలో వేరుశనగ, 15 హెక్టార్లలో మినుముల పంటలు ముంపునకు గురయ్యాయి. బీరకుప్పంలో 100 మీటర్ల పంచాయతీ రాజ్ రోడ్డు ఛిద్రమైంది. రూ.2 లక్షల మేర నష్టం ఏర్పడింది.

రోడ్డు మరమ్మతులు

నగరి : మండలంలోని బీరకుప్పం గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ లింక్ రోడ్డు వరద ఉధృతికి మంగళవారం ఉదయం తెగిపోయింది. దీంతో గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. మంత్రి ఆర్కేరోజా ఆదేశాల మేరకు అధికారులు యుద్ధప్రాతిపదికన రోడ్డుకు మరమ్మతులు చేసి రాకపోకలకు వీలు కలిప్పించారు. ఉదయం ఏర్పడిన సమస్య సాయంత్రానికి పరిష్కారం కావడంపై గ్రామస్తులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



వరద ఉధృతికి తెగిపోయిన బీరకుప్పం రోడ్డు, సిద్ధం చేసిన రోడ్డు

మిచాంగ్‌తో తీరని నష్టం

శ్రీరంగరాజపురం : మండలంలో 72.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దారు బెన్నురాజు తెలిపారు. ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆస్తి, ప్రాణనష్టం నివారించగలిగామన్నారు. మండలంలో దాదాపు 78 శాతం చెరువులు పూర్తిగా నిండాయని, అక్కడక్కడ నీటి ప్రవాహనికి రోడ్లు దెబ్బ తిన్నట్లు చెప్పారు. పాతపాల్యం, జీఎంఆర్ పురం, పుల్లూరు గ్రామాల్లో కాలువలు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయన్నారు. తుపాను ప్రభావం చేత నీట మునిగిన పొలాలను ఆయన పరిశీలించారు. నష్టపోయిన పంటలకు సంబంధించి అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు.

బాధితులను ఆదుకుంటాం..

వెదురుకుప్పం: తుపాను ప్రభావంతో నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకుంటోందని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాంబేడు ఆదిఆంధ్రవాడ, నక్కలాంపల్లె, పచ్చికాపల్లం గ్రామ సచివాలయ పరిధిలోని కాలనీలు, చెరువులను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా పూరిగుడిసెలు కూలి నిరాశ్రయులైన వారిని గుర్తించి వెంటనే ఆర్థిక సాయంతో పాటు పక్కా గృహాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా తుపాను ముప్పుతో ఏర్పడిన నష్టాలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలు ఎవరూ కూడా చెరువులు, కాలువల వద్దకు వెళ్లకూడదని హెచ్చరించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ పురుషోత్తం, డీడీఓ సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వణికించిన మిచాంగ్

పాలసముద్రం : మిచాంగ్ తుపాన్ రైతన్నల గుండెల్లో అలజడి చేసింది. వాతావరణం మారి ఈదురు గాలులు, భారీ వర్షాలకు వరి, చెరుకు పంటలు నేలకొరిగాయి. మంగళవారం చెక్ డ్యాంలలో నీరు పొంగి పొర్లుతోంది.

గంగాధర నెల్లూరులో..

గంగాధర నెల్లూరు: ఎన్టీఆర్ జలాశయం గేట్లు ఎత్తడంతో మండలంలోని నీవా నది ప్రవాహంతో పరీవాహక ప్రాంతంలో నీటి ఉధృతి పెరిగి ఆత్మకూరు–ఎస్ఆర్ పేటకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎస్ఆర్ పేటకు వెళ్లే మార్గంలో దారిలో వేసిన సిమెంటు తూములు కొట్టుకుపోవడంతో చుట్టుపక్కల 15 గ్రామాల ప్రజలు నిత్యావసర సరుకుల కొనుగోలుకు ఇబ్బందులు పడ్డారు. అప్రమత్తమైన అధికారులు సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. వర్షం తగ్గుముఖం పట్టాక దారి ఏర్పాటుకు చర్యలు చేపడతామని తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రంలో సమీపంలో ఉన్న బొమ్మవారిపల్లి మార్గంలో వాగు పొంగి పార్లడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.


ఆముదాల గ్రామంలో పొంగిపొర్లుతున్న చెక్‌డ్యాం


బాధితులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్


శ్రీకావేరిరాజుపురంలో వర్షానికి దెబ్బతిన్న వరిపంట


బొమ్మవారిపల్లి వద్ద పొంగి పొర్లుతున్న వాగు

క్షయవ్యాధిపై అవగాహన



ఆశా కార్యకర్తలకు యూనిఫాం పంపిణీ చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం : క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, సక్రమంగా మందులు వాడితే వ్యాధి పూర్తిగా తగ్గిపోతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. మంగళవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా నోడల్ ఆఫీసర్ సుశీల ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధికి గురైనవారు మానసికంగా కుంగిపోతారని, సకాలంలో వ్యాధిని గుర్తించి మందులు క్రమం తప్పకుండా వాడితే పూర్తిగా తగ్గిపోతుందన్నారు. ముందుగా వ్యాధి గుర్తించడం చాలా సులభమన్నారు. ఒక వ్యక్తికి ఆకలి లేకపోవడం, రెండు వారాలకు మించి దగ్గు ఉండడం, అకస్మాత్తుగా బరువు కోల్పోవడం లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యులను సంప్రదించి డాట్ పద్ధతిలో మందులు వాడాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం పంపిణీ చేసిన యూనిఫాంను ఆశా కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా సహాయక చర్యలు


ఆర్డీఎం గేటు వద్ద సూచనలు ఇస్తున్న కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి


చెర్లోపల్లి వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ బృందం

పుత్తూరు: తుపాను కారణంగా పుత్తూరు పట్టణ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీనిపై మున్సిపల్ చైర్మన్ ఎ.హరి, కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి, డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి బృందం మంగళవారం ముమ్మర సహాయక చర్యలు చేపట్టింది. స్థానిక ఆర్డీఎం గేటు, మరాఠా గేటు, చినరాజుకుప్పం, నెత్తం, చెర్లోపల్లి, వీవర్స్ కాలనీ, భవానీనగర్ ఉప్పుకాల్వ తదితర ప్రాంతాల్లో మున్సిపల్ బృందాలు విడివిడిగా సహాయక చర్యలు చేపట్టాయి. జేసీబీ సహాయంతో నీటిని కాలువల్లోని మళ్లించారు. మంచినీళ్ల గుంట వద్ద కూలిపోయిన టేకు చెట్టును జేసీబీతో తొలగించారు. చెర్లోపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. రాకపోకలకు ఇబ్బంది లేకుండా తాత్కాలిక సహాయ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఏఈలు హేమశేఖర్‌రెడ్డి, కార్తికేయన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలనరసింహులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధికి కృషి చేయండి

శ్రీరంగరాజపురం : ప్రతి ఒక్కరూ దేశ అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. మండలంలోని డీకే మర్రిపల్లి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల ఆరోగ్యం కోసం ఆయుష్మాన్ భవ పథకాన్ని ప్రవేశపెట్టి ఏడాదికి కేంద్రం రూ.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షలు వరకు మెరుగైన వైద్యం అందిస్తున్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు 18 రకాల సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నాయని తెలిపారు.

పంటల సంరక్షణకు సలహాలు


నేలకొరిగిన వరి పంట పరిశీలిస్తున్న అధికారులు

వెదురుకుప్పం: తుపాను ప్రభావంతో పంటలు నష్టపోకుండా రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని చిత్తూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త రెడ్డిరాము అన్నారు. మంగళవారం మండలంలోని మిచాంగ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను ఏఓ వనితతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సరాసరి 150 మి.మీ. వర్షపాతం నమోదు అయినట్లు తెలిపారు. తుపాను కారణంగా పొలాల్లో పంటలను కాపాడుకోవడానికి, నష్టనివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు సలహాలు అందించారు.